# బ్యాంకు రుణాలతో అతివల ఆర్థిక స్వావలంబన

**పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** స్వశక్తి సంఘాల మహిళలు ఆదాయం పెంచుకునేందుకు ముందుకు రావాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలతో అతివలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో వ్యాపార, వాణిజ్య రంగాల్లో వృద్ధి సాధించాలన్నారు. జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఫర్నిచర్, మూత్రశాలలు, ఇతర మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

**మహనీయుల ఆశయ సాధనకు కృషి:** కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి(కాకా) జయంతి సందర్భంగా శనివారం సమీకృత పాలనా ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ శ్రీహర్ష పూలమాల వేసి నివాళులర్పిస్తున్నారు. మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, అధికారులు పాల్గొన్నారు.



కాకా చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, అధికారులు

**10లోగా ఎల్ఆర్ఎస్ అర్జీలు పరిష్కరించాలి :** జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచి, ఈ నెల 10లోగా పరిశీలన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. శనివారం ఆయన జిల్లా పంచాయతీ శాఖ సమీక్షలో మాట్లాడారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో లే అవుట్లపై సంబంధిత శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

# రాయితీ పథకం.. అందని ప్రోత్సాహకం

అయిదేళ్లుగా నిలిచిన టీ-ప్రైడ్ నిధులు



ఈనాడు, పెద్దపల్లి

పారిశ్రామికవేత్తలుగా రాణించాలని ఉన్నా ఆర్థిక పరిస్థితులతో ముందడుగేయలేని వారికి టీ-ప్రైడ్(తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ ర్యాపిడ్ ఇంక్యుబేషన్ దళిత్ ఇంటర్‌ప్రెన్యూర్స్ ఇన్సెంటివ్ స్కీం) పథకం వరంగా మారింది. దళితులు, గిరిజనులు, దివ్యాంగుల్లో ఔత్సాహికులను ఎంపిక చేసి ప్రభుత్వం ఏటా నిధులు కేటాయిస్తోంది. సాంకేతిక, ఇతర కోర్సుల్లో పట్టభద్రులైన యువతకు రాయితీతో కూడిన రుణ సదుపాయాలు కల్పిస్తోంది. దాదాపు అయిదేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

దళితులు, గిరిజనులు, దివ్యాంగులు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం టి-ప్రైడ్ పథకం అమలు చేస్తోంది. పథకం కింద 35 శాతం రాయితీపై గరిష్ఠంగా రూ.75 లక్షల వరకు రుణం మంజూరు ఇస్తున్నారు. మహిళలకు 45 శాతం వరకు రాయితీ ఉంటుంది. పథకం కింద స్టాంప్ డ్యూటీ, విద్యుత్తు ఖర్చులు, వడ్డీల రీయింబర్స్‌మెంట్, పెట్టుబడి రాయితీ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. తెలంగాణ మౌలిక వసతులు సదుపాయాల సంస్థ ఏర్పాటు చేసే పారిశ్రామిక వాడల్లో ఖాళీ స్థలాల కేటాయింపులో పథకం లబ్ధిదారులకు ప్రాధాన్యమిస్తారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్‌లలో ఎక్కువగా బియ్యం మిల్లుల విడిభాగాల పరిశ్రమలు, సిమెంటు ఇటుక తయారీ యూనిట్లను ఎక్కువ మంది ఎంపిక చేసుకున్నారు. రామగుండం, మంథని ప్రాంతాల్లో కొందరు కార్లు, పొక్లెయిన్లు, ఇతర వాహనాలను తీసుకొని లబ్ధి పొందుతుండగా ఆరేళ్లుగా రాయితీ సొమ్ము అందకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**465 యూనిట్లు.. రూ.53.73 కోట్లు**

- పథకాన్ని పూర్తిగా ఆన్‌లైన్ చేయడంతో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే రాయితీ సొమ్ము జమ కానుంది. కొన్నేళ్లుగా ఇది రాకపోవడంతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రోత్సాహం కరవైంది.
- రూ.25 లక్షల మూలధనం దాటితే రాష్ట్ర స్థాయి టీ-ప్రైడ్ కమిటీ, అంతకంటే తక్కువ మొత్తంతో రుణం తీసుకుంటే జిల్లా స్థాయి టీ-ప్రైడ్ కమిటీలు రుణాలు అందిస్తున్నాయి.
- 2019 నుంచి ఇప్పటివరకు ఎస్సీలు 350 యూనిట్లు తీసుకోగా వీరికి దాదాపు రూ.20.69 కోట్ల మేర రాయితీ చెల్లించాల్సి ఉంది. ఎస్టీలు 75 యూనిట్లు తీసుకోగా రూ.16.78 కోట్లు, దివ్యాంగులకు 40 యూనిట్లకు రూ.16.26 కోట్లు రావాల్సి ఉంది. మొత్తం 465 యూనిట్లకు రూ.53.73 కోట్ల మేర రాయితీ సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు అందాల్సి ఉంది.

### త్వరలోనే బకాయిల విడుదల

టీ-ప్రైడ్ కింద 2019 జులై నుంచి ఇప్పటివరకు యూనిట్లు తీసుకున్న లబ్ధిదారులకు రాయితీ సొమ్ము రావాల్సి ఉంది. ఇటీవలే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుల దృష్టి తీసుకెళ్లగా త్వరలో పెండింగ్ నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. కొత్త యూనిట్లు అవసరమైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగానే సాధ్యాసాధ్యాలు పరిశీలించి వారం రోజుల వ్యవధిలో యూనిట్ మంజూరుకు ఎంపిక చేస్తున్నాం.

**- మధుసూదనాచారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి**

# యాసంగికి ముందే లబ్ధిదారుల గుర్తింపు



ముత్తారం: ఆయిల్‌పామ్ తోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆయిల్‌పామ్ సాగు పెంపునకు కసరత్తు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణ చేపట్టింది. వానాకాలం వరి కోతలు త్వరలో ప్రారంభం కానుండటంతో సాగు లక్ష్యాలను చేరుకోవడంపై దృష్టి సారించారు. ఉద్యాన, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో క్లస్టర్ల వారీగా అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. నేల స్వభావం, ఇతర కారణాలతో ఆయిల్‌పామ్ సాగుకు కొన్ని చోట్ల రైతులు ఆసక్తి చూపడం లేదు. యాసంగి పంటల సాగు ఆరంభం కాకముందే లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

### క్షేత్ర స్థాయిలో సందేహాల నివృత్తి

వ్యవసాయ, ఇతర శాఖల సహకారంతో ఉద్యాన అధికారులు రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. రైతులను క్షేత్ర స్థాయి సందర్శనకు తీసుకెళ్తున్నారు. సాగు చేసిన రైతులతో మాట్లాడిస్తూ ఇతరుల్లో స్ఫూర్తి కలిగేలా చేస్తున్నారు. రైతులతో సమావేశమై సందేహాలు నివృత్తి చేస్తున్నారు. ఒక ఎకరం విస్తీర్ణం ఉన్న రైతులను కూడా సాగుకు అనుమతిస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత పంట చేతికి అందనుండటంతో కౌలు రైతులు ఆయిల్‌పామ్ సాగుకు వెనుకాడుతున్నారు. 5-10 ఎకరాల్లోపు భూములున్న రైతులు సాగుకు ముందుకు రావడం లేదు. జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతం ఎక్కువగా ఉండటం, రెండు పంటలకు నీరు లభిస్తుండటం కూడా ఆయిల్‌పామ్ సాగులో వెనుకబడటానికి కారణమని అధికారులు చెబుతున్నారు.

### 2 వేల ఎకరాల లక్ష్యం

జిల్లాలో 2022-23లో 415 మంది రైతులు 1,252.71 ఎకరాలు, 2023-24లో 489 మంది రైతులు 1,113.85 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుత సంవత్సరం 2 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 116 మంది రైతులు 350 ఎకరాల్లో సాగు చేయగా మరో 242 మంది రైతులు 700 ఎకరాలకు డీడీలు చెల్లించారు. మిగిలిన 950 ఎకరాలకు డీడీలు చెల్లించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, సన్న, చిన్నకారు రైతులకు బిందు సేద్యం పరికరాలకు రాయితీ కల్పిస్తున్నారు. పెట్టుబడి ఖర్చుల కింద ఏడాదికి రూ.4,200 చొప్పున మూడేళ్లకు రూ.16,800 కేటాయిస్తున్నారు.

### మూడేళ్లు నిర్వహణ ఖర్చులు

ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకం. మొక్కలు నాటిన నాలుగేళ్లకు దిగుబడి ప్రారంభమవుతుంది. అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. వానాకాలం వరి కోతలకు ముందుగానే లబ్ధిదారులను గుర్తిస్తాం. రాయితీపై బిందు సేద్యం పరికరాలు పంపిణీ చేస్తున్నాం. మూడేళ్ల నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది. **- జగన్మోహన్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి**

# ఉమ్మడి జిల్లాలో న్యాయమూర్తుల బదిలీ

**జగిత్యాల, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లాలో ఆరుగురు జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలు జరగ్గా వారిస్థానాల్లో వివిధ ప్రాంతాల నుంచి కొత్త వారిని నియమించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్‌ను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. సికింద్రాబాద్ జ్యుడిషియల్ అకాడమి ఏవోగా ఉన్న కె.వెంకటమల్లిక్ సుబ్రమణ్యశర్మ జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి కె.రాణిని కరీంనగర్ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్‌ను అక్కడే జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. సంగారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మణాచారిని రాజన్నసిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి పి.బి.కిరణ్ కుమార్‌ను హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. షాద్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ్‌ను గోదావరి సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. భువనగిరి జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావును మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. గోదావరిఖని సీనియర్ సివిల్ భృంగి శ్రీనివాస్‌ను పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అక్కడి కె.స్వరూపరాణిని పెద్దపల్లి న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు.

# ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

**పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** పెద్దపల్లి ఎంఈవో కార్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారం ముగిసిందని డీఈవో మాధవి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 93 పోస్టులు ఖాళీలుండగా ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. జిల్లాలో ఆరుగురు అభ్యర్థులు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపిక కాగా స్కూల్ అసిస్టెంట్‌కే మొగ్గు చూపారు. 10 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు సక్రమంగా లేకపోవడంతో తిరస్కరణకు గురయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరి తర్వాత వరుస క్రమంలో ఉన్న వారికి కొలువు దక్కనుంది. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ గ్రేడ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో అభ్యర్థులు నిరాశకు గురయ్యారు.

# మూస పంటలు వీడితేనే సాగులో లాభాలు

జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి



కుక్కలగూడూరులో మాట్లాడుతున్న డీఏవో ఆదిరెడ్డి

**పాలకుర్తి, న్యూస్‌టుడే:** మండలంలోని కుక్కలగూడూరులో ఆయిల్‌పామ్ పంట సాగుపై గ్రామస్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. రైతులు కేవలం వరి, పత్తి పంటల మీద ఆధారపడకుండా అధిక లాభాలు వచ్చే ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ పంటకు కోతులు, పందులు తదితర జంతువుల బెడద ఉండదన్నారు. వాటి మొక్కలపై 90 శాతం, డ్రిప్ పరికరాలపై 80 శాతం రాయితీలు, అంతర పంటల సాగుకు ప్రతి ఏడాది రూ.4500 ప్రోత్సాహకం లభిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ ప్రతులతో రైతువేదికల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనాథ్, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, తిరుమల ఆయిల్ ఇండస్ట్రీస్ గ్రూప్ సీఈవో కళ్యాణ్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌కుమార్, ఏఈవోలు శశిధర్, రాజ్‌కుమార్, యోజన, రైతులు పాల్గొన్నారు.

# చిన్ని తెర.. పెద్ద సందేశం

స్ఫూర్తిదాయక లఘు చిత్రాల రూపకల్పన

ఆదివారం ప్రత్యేకం

న్యూస్‌టుడే, మేడిపల్లి

సృజనాత్మకత ఉండి సినిమాలు తీయడం సాధ్యం కాని వారికి యూట్యూబ్ ఒక అవకాశంగా మారింది.. యువత దర్శకులుగా, నిర్మాతలుగా, ఫొటోగ్రఫీ తదితర సాంకేతిక రంగాల్లో తమదైన ముద్ర వేయడానికి తోడ్పడుతోంది.. ఎక్కువ మంది యూట్యూబ్‌ను ఆదాయ మార్గంగా మలచుకుంటుండగా కొందరు మాత్రం సామాజిక అంశాలను స్పృశిస్తూ లఘుచిత్రాలు నిర్మిస్తున్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, బాలికలపై వేధింపులు, ట్రాఫిక్ నిబంధనల అమలుపై అవగాహన కల్పిస్తూ లఘు చిత్రాలు నిర్మిస్తూ అవార్డులు కూడా సొంతం చేసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇలా విభిన్న అంశాలను చిత్రాలుగా మలచి సామాజిక బాధ్యత చూపుతున్న వారిపై కథనం...

### మత్తు వదలాలని..



దర్శకుడు : **శివకృష్ణ బుర్రా**
నిర్మాణం : **మై విలేజ్ షో**
స్వస్థలం : **లంబాడిపల్లి, మల్యాల మండలం**
లఘు చిత్రం : **రేవ్‌పార్టీ**





కథాంశం : గంజాయికి అలవాటుపడిన యువకులు కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురి చేస్తుంటారు. పోలీసులు నిఘా వేసి రేవ్ పార్టీ ఏర్పాటు చేసి యువకులను ఆ పార్టీకి రప్పించి అరెస్టు చేస్తారు. గంజాయి సరఫరా సహా డీలర్లపై నిఘా పెంచుతారు. మత్తుకు బానిసైన యువకులను రిహాబిలిటేషన్ కేంద్రానికి పంపి మామూలు యువకులుగా మారుస్తారు.

### మతమా.. మానవత్వమా



లఘుచిత్రం : **మతమా... మానవత్వమా**

నిర్మాత, దర్శకుడు : **దామెర శంకర్** స్వస్థలం : **గోదావరిఖని**

అవార్డు : **వీకేఆర్, ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేం మీడియా రాష్ట్రస్థాయి అవార్డు**

కథాంశం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ హిందువును క్రిస్టియన్, ముస్లిం, హిందూ మతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఆసుపత్రిలో చేర్పించి రక్తదానం చేస్తారు. కోలుకుంటున్న వ్యక్తిని తమ మతంలో చేర్చుకుంటామంటూ ముస్లిం, క్రిస్టియన్ వ్యక్తులు అంటుంటే గాయపడిన వ్యక్తి మీరిచ్చిన రక్తం తనకు వద్దంటూ చేయి కోసుకుంటాడు. అక్కడే ఉన్న వైద్యుడు మతం కంటే మానవత్వమే గొప్పదంటూ చేసిన హితబోధతో లఘు చిత్రం ముగుస్తుంది.



### మధ్య తరగతి జీవితాలకు నిలువుటద్దం



దర్శకుడు : **అనసూరి భూనాథా చారి**
స్వస్థలం : **బెజ్జంకి మండలం తోటపల్లి**
ప్రస్తుతం : **కరీంనగర్**

లఘుచిత్రాలు : **రాజవ్వ, పల్లవి, మనిషి**





కథాంశాలు : భర్త తాగుడుకు బానిసైనా, తను నిరాదరణకు గురయినా నిలదొక్కుకునే అంశంతో రాజవ్వను తెరకెక్కించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చాలా మంది బాలికలను ప్రోత్సహించాల్సింది పోయి వారిని సూటిపోటి మాటలతో వేధించే వారే ఎక్కువ. ప్రభుత్వ పాఠశాలలో చదివే ఓ బాలిక తన తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుంటే మధ్యాహ్న భోజనం సమయంలో ఇచ్చే గుడ్డు తీసుకుని ఇంటికి వెళ్తుంది. తోటి పిల్లలు గుడ్డు దొంగతనం చేస్తోందంటూ బాలికపై ఫిర్యాదు చేస్తారు. ప్రిన్సిపల్ బాలిక వెనకే వెళ్లి చూడగా పేదరికంతో మగ్గుతున్న తన తల్లికి క్యాన్సర్ ఉన్నందున గుడ్డు తినిపిస్తుందని తెలిసి చిన్నారిని ప్రోత్సహించిన అంశంతో పల్లవి అనే లఘు చిత్రాన్ని తీశారు. మనిషి పశువైతే అనే లఘుచిత్రంలో మానవత్వం లేని క్రూరుడిని ధైర్యం కూడబలుక్కుని చంపేసే చిన్నారుల కథతో లఘు చిత్రం తెరకెక్కించారు.

### సామాజిక అంశాలే ఇతివృత్తంగా..





వన్ డే ఫర్ సీనియర్ సిటిజన్స్



రామ్ మొగిలోజి

దర్శకుడు: **రామ్ మొగిలోజి** స్వస్థలం : **గంగాధర మండలం కాసారం**
ప్రస్తుత నివాసం : **కరీంనగర్**
లఘుచిత్రాలు : **వృద్ధుల హక్కుల పరిరక్షణ, స్త్రీ స్వేచ్ఛ, అంకితం, డయల్ 100, గంజాయి డౌన్‌డౌన్**

- ఒడిశాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో గంజాయి డౌన్‌డౌన్ లఘుచిత్ర దర్శకుడు రామ్ మొగిలోజి బెస్ట్ డైరెక్టర్‌గా నామినేట్ అయ్యారు. అక్టోబరు 17న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

**కథాంశాలు :** నిత్య జీవితంలో వివిధ ప్రదేశాల్లో నిరాదరణకు గురవుతున్న వృద్ధులకూ హక్కులు ఉంటాయనే వివరణతో చిత్రం తీశారు. స్త్రీ స్వేచ్ఛ అనే చిత్రంలో స్త్రీ అంటే భారం కాదు ఆస్తిగా భావించే రోజులొచ్చాయనే అంశాన్ని స్పృశించారు. భార్య, కుమారుడితో ఉంటున్న కానిస్టేబుల్ విధి నిర్వహణకే అంకితమై కుటుంబానికి సమయం ఇవ్వలేక... ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంశాన్ని అంకితం ద్వారా వివరించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్సై తన కూతురుకు తీవ్ర జ్వరం వచ్చినా ఫోన్‌కూ స్పందించకపోవడంతో అక్కయ్యతో కలసి ఆసుపత్రికి వెళ్తుంటే ఆకతాయిల నుంచి ప్రమాదంలో పడే సమయంలో తనను తాను రక్షించుకునే కథను డయల్ 100లో చూపారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహిస్తే గంజాయి బారిన పడిన చిన్నారి కథాంశంతో గంజాయి డౌన్ డౌన్ అనే లఘుచిత్రం తీశారు.

# గనుల్లోకి దిగని కార్మికులు

- నాయకుల అండతో విధుల్లోకి చేరిక
- తలలు పట్టుకుంటున్న అధికారులు



న్యూస్‌టుడే, గోదావరిఖని

■ గనిలో కొత్తగా ఉద్యోగంలో చేరిన కార్మికుడిని ఓ విభాగానికి సహాయకుడిగా నియమించారు. సూపర్‌వైజర్ల వెంట వెళ్లి వారికి సహాయం చేయాల్సిన సదరు కార్మికుడికి ఆ విభాగ పనులపై అవగాహన రావడం లేదు. దీంతో సదరు సూపర్‌వైజర్ మాకు ఆ కార్మికుడు అవసరం లేదని గని అధికారికి మొరపెట్టుకున్నాడు. ఫలితంగా సదరు కార్మికుడి తరపున కొంత మంది నాయకులు ఇటు అధికారులను, అటు ఆ విభాగంలోని సీనియర్ ఉద్యోగులను బెదిరిస్తున్నారు.

■ వృత్తి శిక్షణ కేంద్రంలో తర్ఫీదు అనంతరం ఓ కొత్త కార్మికుడు నాయకులు, ప్రజాప్రతినిధుల ద్వారా ఉపరితల గనిపై విధుల్లో చేరారు. సీనియర్ కార్మికులుండగా కొత్తగా వచ్చిన వారికి పైభాగంలో పనులు ఏ విధంగా కల్పిస్తారంటూ సంబంధిత గని కార్మికులు ఆందోళన చేపట్టారు.

సింగరేణిలో కొత్తగా చేరుతున్న కార్మికులకు బొగ్గు ఉత్పత్తిపై కనీస అవగాహన ఉండటం లేదు. భూగర్భ గనుల్లోకి దిగకుండా.. ఉపరితల గనులపైనే విధులకు మొగ్గు చూపుతున్నారు. వీరికి ప్రజాప్రతినిధులు, గుర్తింపు సంఘాల నాయకుల అండ తోడవటంతో సింగరేణి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అలాంటి వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే కింది స్థాయి అధికారి నుంచి డైరెక్టర్ వరకు నాయకుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. గతంలో భూగర్భ గనుల్లో తట్టతో టబ్బుల్లో బొగ్గు నింపేవారు. ప్రస్తుతం ఆ విధానం పోయి.. యంత్రాల ద్వారానే పనులు చేపడుతున్నారు. కష్టం లేకుండా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఎస్డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాలతోనే బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. వాటికి అనుగుణంగా గనుల్లో పనులు చేయాల్సి ఉంటుంది. అయితే చిన్న చిన్న పనులకు కూడా కొత్తగా చేరిన కార్మికులు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. నూతనంగా చేరే కార్మికులు శ్రమ లేకుండా, చెమట రాకుండా చూసుకోవడంతో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

### పని విధానం కనుమరుగు

భూగర్భ గనుల్లో ప్రాథమిక పనులపై కార్మికులకు కనీస అవగాహన ఉండాలి. కానీ గనిలో కొన్ని పని స్థలాలను కూడా గుర్తించలేని పరిస్థితిలో కొంత మంది కార్మికులున్నారు. సాధారణంగా గనుల్లో వివిధ పనులు చేసే వారిని టెండాల్, సపోర్టుమెన్, రూఫ్‌బోల్టర్, కోల్‌కట్టర్, షార్టుఫైరర్, సర్దార్, ఓవర్‌మెన్ పేర్లతో పిలుస్తారు. వీరందరూ బొగ్గు ఉత్పత్తిలో భాగస్వామ్యం అవుతారు. వీరి పనులపై అవగాహన కోసం తప్పనిసరిగా ఈ విభాగాలకు చెందిన సీనియర్ ఉద్యోగుల వద్ద నూతన కార్మికులను సహాయకులుగా నియమిస్తారు. కాని ఇటీవల కాలంలో ఎవరు దీనిపై దృష్టి సారించడం లేదు. పనిలో చేరగానే కార్యాలయాలు, జీఎం కార్యాలయాలు, సివిల్, ఏరియా వర్క్‌షాపులు, వివిధ విభాగాల్లో విధుల కోసం ప్రయత్నిస్తున్నారు. గనుల్లో పనిచేసి కనీస అవగాహన పెంచుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదు.

### ఆందోళనలో యాజమాన్యం

భవిష్యత్తులో భూగర్భ గనులను ఏ విధంగా నడపాలన్న విషయంలో యాజమాన్యం ఆందోళన చెందుతోంది. గతంలో సీనియర్ కార్మికులు ఎంత కష్టమైనా పని చేసేవారు. కానీ ప్రస్తుతం కష్టపడకుండా యంత్రీకరణ పెరిగినా కనీసం అవగాహన పెంచుకోవడానికి కూడా నూతన కార్మికులు ముందుకు రావడం లేదు. ఇప్పటికే భూగర్భ బొగ్గు గనుల్లో ఉత్పత్తి తగ్గుతోంది. రూ.కోట్లతో కొనుగోలు చేసిన యంత్రాలను గనుల్లోకి దింపుతున్నా వాటికి సహాయంగా చేపట్టే పనులకు కార్మికులు ముందుకు రాకపోవడంతో పని నైపుణ్యం కొరవడుతోంది.

# ఎండా వానల్లోనే నిరీక్షణ



సుల్తానాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బస్సు షెల్టరు లేక ప్రయాణికులు ఎండలో నిరీక్షించాల్సి వస్తోంది. కరీంనగర్, గోదావరిఖని, కాల్వశ్రీరాంపూర్, ఓదెల వైపు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ఇక్కడే వేచి చూస్తుంటారు. ఎండావానలకు ఇబ్బందులు ఎదురవుతున్నందున ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి షెల్టరు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. – న్యూస్‌టుడే, సుల్తానాబాద్

# ఆటపాటల చదువు అందేదెన్నడు!

ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్న ప్రీ స్కూళ్లకు ప్రభుత్వం సామగ్రిని, చిన్నారులకు ఏకరూప దుస్తులను కేటాయించింది. మంథనిలో రెండు నెలలవుతున్నా వీటిని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడం లేదు. ప్రతి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 10 కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రీస్కూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో చిన్నారులు ఆట పాటలతో పూర్వ ప్రాథమిక విద్య నేర్చుకునేందుకు వీలుగా టేబుళ్లు, మ్యాట్స్, బెంచీలు, వివిధ రకాల ఆట సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ విషయమై ఇన్‌ఛార్జి సీడీపీవో పుష్పలతను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రాజెక్టు పరిధిలో ప్రీస్కూళ్లకు సంబంధించి ఎంపిక చేసిన కేంద్రాల వివరాలు ఇప్పటికీ రాలేదని, ఉన్నతాధికారుల నుంచి రాగానే సామగ్రిని సరఫరా చేస్తామని చెప్పారు.



– న్యూస్‌టుడే, మంథని

## బోనాల సమర్పణ.. కుంకుమ పూజలు


గోదావరిఖని : కళ్యాన్‌నగర్‌లో బోనాల సందడి

**గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే:** నవరాత్రోత్సవాల్లో భాగంగా గోదావరిఖని కళ్యాన్‌నగర్‌లోని మండపంలో కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బోనాల సమర్పణ కార్యక్రమం చేపట్టారు. మండపం నుంచి డప్పుచప్పుళ్లతో ప్రధాన కూడలిలోని పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించారు. గౌతమినగర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో విశేషంగా కుంకుమపూజలు నిర్వహించారు. కూడలిలోని దుర్గాదేవి మండపంలో కోలాటాలతో దుర్గాదేవి పల్లకిసేవ చేశారు.

### భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం

**పాలకుర్తి, న్యూస్‌టుడే:** మండలంలోని రామారావుపల్లి, బసంత్‌నగర్ గ్రామాల్లో రామగుండం భాజపా ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భాజపా సభ్యులుగా చేరడం ద్వారా ప్రజలు పార్టీ సిద్ధాంతాలకు మద్దతు ఇవ్వడమే కాకుండా దేశ అభివృద్ధికి చేసిన వారవుతారన్నారు. పార్టీ నాయకులు క్రిష్ణ, మహేష్, తిరుపతి, వెంకటేష్, పద్మ పాల్గొన్నారు.

## విధుల నుంచి ఇద్దరి తొలగింపు

**పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సదరమ్ ధ్రువపత్రం కోసం నాలుగు నెలల కిందట జిల్లా ఆసుపత్రికి వచ్చిన దివ్యాంగుడి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో ఆరోగ్యశ్రీకి చెందిన ఒకరిని, పొరుగు సేవలకు చెందిన మరొకరిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకుడు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుడు ఆధారాలతో కలెక్టర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

## పంచాయతీకి ఎలక్ట్రికల్ సామగ్రి వితరణ

**మంథని గ్రామీణం, న్యూస్‌టుడే:** కాకర్లపల్లి పంచాయతీకి శనివారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మెండె రాజయ్య వీధి బల్బులు, ఎలక్ట్రిక్ సామగ్రిని వితరణ చేశారు. గ్రామంలో పలు చోట్ల వీధి దీపాలు లేక పోవడంతో అంధకారం నెలకొంటోంది. బతుకమ్మ, దసరా పండుగలకు ఇబ్బందులు లేకుండా రాజయ్య సామగ్రిని పార్టీ నాయకులతో కలిసి పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నారాణికి సామగ్రి అందజేశారు. అనంతరం 42 సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న గాదె మల్లక్కను శాలువాలతో సన్మానించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కనవేన ఓదేలు, నాయకులు లక్ష్మణ్, కుమారస్వామి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రాలు మార్ఫింగ్.. ఇద్దరి అరెస్టు

**నారాయణగూడ, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న ఇద్దరిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పెరుకపల్లికి చెందిన ప్రైవేటు ఉద్యోగి గడ్డం అనిల్‌కుమార్(27), రంగారెడ్డి జిల్లా కొందుర్గుకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు కాశమోని రమేష్(48)లు సీఎంకు సంబంధించిన చిత్రాలను మార్ఫింగ్ చేస్తూ.. అసభ్యకరమైన వ్యాఖ్యల్ని జోడించి 'కేటీఆర్ సేన రంగారెడ్డి' వాట్సాప్ గ్రూప్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నట్లు గుర్తించారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.



## PERSONAL NOTICE

Regd. Post with Ack.Due

Date: 03.08.2024

To
1) Mandala Vikram Reddy S/o. Ram Reddy, Aged about 58 years, Occ : Advocate, R/o. H.No.2-10-828, Jyothinagar locality of Karimnagar Town and District 505001.
4). Dr. Suram Ram Reddy S/o. Durga Reddy, Aged about 69 years, Occ ; Doctor, R/o. H.No.3-1-327, Christian Colony locality of Karimnagar Town and District - 505001.
10) Dr. G.Prabhakar Reddy S/o. Ram Reddy, Aged about 60 years, Occ : Doctor, R/o. H.No.4-5-162, Ashoknagar locality of Karimnagar town and District - 505001.
15). Cheerla Raji Reddy S/o. Ram Reddy, Aged about 68 years, Occ : Agriculture, R/o. Parlapalli village, Thimmapurmandal, Karimnagar District - 505469.
24). Singireddy Sudhakar Reddy S/o. Raja Reddy, Aged about 66 years, Occ : Business, R/o. Galipally Village of Ellanthakunta mandal of Karimnagar District 505530.
25). Enugu Anitha W/o. Sanjeeva Reddy, Aged about 46 years, Occ : Household, R/o. H.No.2-10-1573, Chaitanyapuri locality of Karimnagar City and District - 505001.
27). Musuku Manga Reddy W/o. late Bharathsimha Reddy, Age : Not known, Occ : Doctor, R/o. H.No.4-6-159, Gandhi Road, Karimnagar town and district - 505001.
28). Vontela Suguna W/o. Jagapathi Reddy, Aged about 75 years, Occ: Household, R/o. H.No.2-10-1519, Jyothinagar locality of Karimnagar town and district 505001.
29). Vontela Madhuma Reddy W/o. Upender Reddy, Aged about 50 years, Occ: Household, R/o. Flat No.104, Air Bus Apartment, near petrol bunk, Himayatnagar, Hyderabad - 500 027.
30). VontelaAnirudh Reddy S/o. Upender Reddy, Age : Not known, Occ: Student, Rep. by his natural Mother and guardian Vontela Madhuma Reddy W/o. Upender Reddy, Occ : Household, R/o. Flat No.104, Air Bus Apartment, near petrol bunk, Himayatnagar, Hyderabad - 500 027.
31). Vontela Revanth Reddy S/o. Upender Reddy, Age : Not known, Occ : Student, Rep. by his natural mother And guardian Vontela Lahari, Occ : Household, R/o. H.No.2-10-1519, Jyothinagar locality of Karimnagar town and district 505001.
35). Palle Aruna W/o. Chandra Reddy D/o. Chada Peddi Reddy, age : 54 years, Occ : Household, R/o. H.No.2-10-1264, Jyothinagar, Karimnagar 505001.
38). Aleti Madhumathi W/o. Sudhakar Reddy, D/o. Chada Peddi Reddy, age : 46 years, Occ : Household, R/o. Flat No.501, Akshaya Fortune Apartments, near IG Station, Old Alwal, Secunderabad - 10.
Sub: Notice in A.S. No. 377 of 2024 - Reg.

* * *

Take Notice, that my client Raja Bahadur Venkat Ram Reddy Vigyana Parishad, Karimnagar Rep. by its General Secretary Sri Banda Gopal Reddy S/o. Thirupathi Reddy filed A.S. No. 377 of 2024 before the Hon'ble High Court against the Judgement and Decree dt. 29.12.2023 in O.S. No. 35 of 2016 on the file of Principal District Judge, Karimnagar. The said A.S. No. 377 of 2024 came up for hearing before the Hon'ble Court on 19.09.2024, and the Hon'ble Court directed us to take out substituted service by paper publication to you and posted the matter to 17.10.2024 for your appearance either in person or through your counsel.
This is for your information.

Sd/- **Sriram Polali**, Advocate
Flat No. 407, White House Apts, Road No .13, Banjara Hills, Hyderabad - 34 Ph.9618832313.

Sd/- **Jupally Satyanarayana** Rao, B.Sc., L.L.M. Advocate
H.No. 3-7-882, Vavilalapally, KARIMNAGAR-505 001 (T.S)
Mobile: 9440517091

# క్రీడా పోటీలు ప్రారంభం

**కమాన్‌పూర్ (సెంటినరీ కాలనీ), న్యూస్‌టుడే:** ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సెంటినరీకాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆర్జీ-3, ఏపీఏ, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య రీజినల్ స్థాయి బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఆర్జీ-3 ఏరియా డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ డా.కల్యాణ్‌చక్రవర్తి పోటీలను ప్రారంభించగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, పర్సనల్ విభాగ ఉపతి సుదర్శనం, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్ల శ్రీనివాస్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ కల్యాణ్‌చక్రవర్తి




**యైటింక్లయిన్‌కాలనీ:** వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో కాలనీలోని డాక్టర్ అబ్దుల్ కలాం మైదానం ఆవరణలో క్రీడా పోటీలను అధికారులు శనివారం నిర్వహించారు. రన్నింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, అథ్లెటిక్ పోటీలు నిర్వహించగా.. డివిజన్‌లోని ఓసీపీ-3, వకీలుపల్లిగని, వర్క్‌షాప్, స్టోర్స్, రెస్క్యూతో పాటు ఆయా విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

## రాజకీయ జోక్యం తప్పుడు ప్రచారం

**గోదావరిఖని, న్యూస్‌టుడే:** సంస్థలో రాజకీయ జోక్యం పెరిగిందని గుర్తింపు సంఘాల నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఐఎన్టీయూసీ నాయకుడు ఎస్.నర్సింహారెడ్డి అన్నారు. గోదావరిఖనిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లాభాల వాటాపై తెబొగకాసం నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. నాయకులు ధర్మపురి, లక్ష్మిపతి, దాసు, సదానందం, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎల్‌హెచ్‌డీ యంత్రం ప్రారంభం

**గోదావరిఖని, న్యూస్‌టుడే:** చాలా కాలంగా ఉన్న యంత్రాలు పాతవి కావడం.. నిత్యం మరమ్మతులకు గురవడంతో కొత్తగా మూడు ఎల్‌హెచ్‌డీ యంత్రాలను కొనుగోలు చేశారు. వాటిల్లో ఒక ఎల్‌హెచ్‌డీ యంత్రాన్ని శనివారం 11వ గనిలో ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ప్రారంభించారు. పూజలు నిర్వహించిన అనంతరం యంత్రంతో లాంఛనంగా పనులు మొదలుపెట్టారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఉత్పత్తి పెంచాలని ఈ సందర్భంగా జీఎం సిబ్బందికి సూచించారు.

## బకాయిలు ఇప్పించడానికి కృషి చేయాలి

**యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంస్థకు రావాల్సిన రూ.29వేల కోట్ల బకాయిలు ఇప్పించడానికి కోల్‌బెల్ట్ ప్రాంతంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ కోరారు. శనివారం ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్ ఆవరణలో నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఈ-విధానం వల్ల సింగరేణికి రావాల్సిన కోయగూడెం ఓసీ, సత్తుపల్లి బ్లాకులు ప్రైవేటు కంపెనీలకు వెళ్లాయన్నారు. గతంలో కంటే ప్రస్తుతం సంస్థలో రాజకీయ జోక్యం తీవ్రమైందని ఆరోపించారు. నాయకులు రవీందర్, అన్నారావు, సాంబశివరావు, నారాయణ, సంజీవ్ పాల్గొన్నారు.


ద్వార సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

## 'సంస్థలో ఆర్థిక సంక్షోభం'

**యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే:** లాభాల్లో అగ్రస్థానంలో నిలుస్తున్న సింగరేణిలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని సీఐటీయూ ప్రధానకార్యదర్శి నరసింగరావు ఆరోపించారు. శనివారం కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం సింగరేణికి రూ.29 వేల కోట్ల బకాయిలు ఉండగా.. ప్రస్తుత ప్రభుత్వం రూ.4 వేల కోట్లు బకాయిలు చేసిందన్నారు. ఫలితంగా కార్మికుల వేతనాలు, లాభాల వాటా, దీపావళి బోనస్‌లపై ప్రభావం పడుతోందన్నారు. దీంతో యాజమాన్యం అప్పుల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నాయకులు వినయ్, నరహరిరావు, ప్రవీణ్‌కుమార్, వెంకన్న, రాంప్రసాద్ పాల్గొన్నారు.

# వెంకటస్వామికి నివాళి

**కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే:** కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని శనివారం ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల ఆధ్వర్యంలో ఆర్జీ-3 జీఎం కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. జీఎంలు నరేంద్ర సుధాకరరావు, కొప్పుల వేంకటేశ్వర్లు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**గోదావరిఖని:** కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆర్జీ-1 జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి జీఎం లలిత్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ బి.జనక్‌ప్రసాద్ గోదావరిఖని ఐఎన్టీయూసీ కార్యాలయంలో 'కాకా' చిత్రపటానికి నివాళులర్పించారు.


ఐఎన్టీయూసీ కార్యాలయంలో జనక్‌ప్రసాద్


ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో..


నివాళులర్పిస్తున్న జీఎంలు సుధాకరరావు, వేంకటేశ్వర్లు

## ఆరుగురు జీఎంల బదిలీ

**కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే:** మైనింగ్ విభాగంలో ఆరుగురు జనరల్ మేనేజర్లను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీఎం ఇన్ఫర్మేషన్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ అయినాల రవికుమార్‌ను క్వాలిటీ మేనేజ్‌మెంట్‌కు, పర్యావరణ జీఎం ఎ.మనోహర్ కార్పొరేట్ ప్రాజెక్టు, ప్లానింగ్‌కు.. క్వాలిటీ మేనేజ్‌మెంట్ జీఎం ఆర్.నారాయణరావు రీసెర్చ్, డెవలప్‌మెంట్‌కు, రీసెర్చ్, డెవలప్‌మెంట్ జీఎం బానోతు సైదులును పర్యావరణ విభాగానికి, మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ జీఎం విజయభాస్కరరెడ్డిని ఒప్పంద మేనేజ్‌మెంట్ విభాగానికి, మరో జీఎం బత్తుల శ్రీనివాసరావును ఇన్ఫర్మేషన్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ విభాగానికి జీఎంగా బదిలీ చేశారు.


ధర్మారంలో కేకు కోస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్


ఖనిలో కాకా విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

## కాకా సేవలు చిరస్మరణీయం

నిరుపేదల అభ్యున్నతికి మాజీ మంత్రి జి.వెంకటస్వామి(కాకా) చేసిన కృషి మరువలేనిదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాకా జయంతిని పురస్కరించుకొని శనివారం ధర్మారం, సుల్తానాబాద్ పట్టణాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు వేర్వేరుగా పాల్గొన్నారు. ధర్మారం రక్తదాన శిబిరంలో విప్ రక్తదానం చేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుల్తానాబాద్‌లోని కాకా విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. జిల్లాలోని మండలకేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వెంకటస్వామికి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు నివాళులర్పించారు.

-న్యూస్‌టుడే బృందం


సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు

## ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీలపై చర్యలు

**పెద్దపల్లి, న్యూస్‌టుడే:** రాజీవ్ రహదారిపై అధిక లోడ్‌తో వెళ్తున్న బూడిద లారీలను శనివారం పెద్దపల్లిలో ట్రాఫిక్ పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వాహనాల నుంచి బూడిద రోడ్డుపై పడుతుండటంతో స్థానికులకు ఎదురవుతున్న ఇబ్బందులపై వారికి వివరించారు. అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలకు జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ సీఐ అనిల్ తెలిపారు.

## శుద్ధ జల కేంద్రం ప్రారంభం

**సుల్తానాబాద్, న్యూస్‌టుడే:** సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతు చేసిన శుద్ధ జల కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ప్రధానాచార్యులు రాంచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే:** కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన భూషనవేన లక్ష్మణ్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. 1999-2000 సంవత్సరంలో అతడితో కలిసి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు కుటుంబానికి అండగా నిలిచారు. శనివారం లక్ష్మణ్ భార్య మానసకు రూ.25 వేల నగదు అందజేశారు.


స్నేహితుడి భార్యకు నగదు అందజేస్తున్న సహాధ్యాయులు

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై పరిశీలన

**కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే:** రామగిరి మండలం బుధవారంపేట పంచాయతీని నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం(ఎన్ఎల్ఎం) సభ్యులు బాలమురళి, సునీల్‌లు శనివారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై పరిశీలించారు. ఉపాధిహామీలో కల్పిస్తున్న పనుల వివరాలు, రోజువారీ వేతనం, స్వయం సహాయక సంఘాల రుణాలు, సామాజిక పింఛన్లపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఏపీడీ సత్యనారాయణ ఎంపీడీవో శైలజరాణి, విజిలెన్స్ అధికారి కొమురయ్య, ఎస్‌బీఎం రాఘవులు, ఈసీ లక్ష్మణ్, ఏపీఎం స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒగ్గు కళాకారుడి మృతికి సంతాపం

**ధర్మారం, న్యూస్‌టుడే:** నందిమేడారానికి చెందిన ఒగ్గు కథ కళాకారుడు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు మ్యాకల మల్లేశం(48) శనివారం మృతి చెందారు. ఉదయం అస్వస్థతకు గురవడంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. వివిధ గ్రామాల కళాకారులు, క్రీడాకారులు సంతాపం తెలిపారు.


మల్లేశం

# రైతుల అభ్యున్నతికే సహకార సంఘాలు

**ఓదెల, న్యూస్‌టుడే:** రైతుల అభ్యున్నతి కోసమే సహకార సంఘాలు పని చేస్తున్నాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. నాబార్డు నిధులు, సహకార సంఘం సొంత నిధులు రూ.80 లక్షలతో ఓదెల మండలం పొత్కపల్లిలో నిర్మించిన సంఘం నూతన భవనం, రూ.27 లక్షలతో నిర్మించిన గోదామును శనివారం ఆయన కేడీసీసీబీ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. రుణమాఫీ విషయంలో రైతులు అధైర్యపడవద్దని, రూ.2 లక్షల వరకు రుణమాఫీ కచ్చితంగా అమలు చేస్తామన్నారు. కనగర్తి, ఓదెల, కొలనూర్ గ్రామాల్లో గోదాముల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని తహసీల్దారును కోరారు. సహకార సంఘాల ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని కేడీసీసీబీ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 33 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, సంఘం సీఈవో గోలి అంజిరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, నాయకులు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, దొనకొండ మల్లారెడ్డి, పచ్చిమట్ల శ్రీనివాస్, బైరి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పొత్కపల్లిలో సహకార భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, చిత్రంలో డీసీసీబీ ఛైర్మన్ రవీందర్‌రావు

**కాల్వశ్రీరాంపూర్:** మండలకేంద్రంలో శనివారం వివిధ గ్రామాలకు చెందిన 52 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే విజయరమణారావు చెక్కులు పంపిణీ చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు దసరా తర్వాత గృహాలు మంజూరు చేస్తామన్నారు. వానాకాలంలో పండిన సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని, 15 రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఉప తహసీల్దార్ శంకర్, ఎంపీవో గోవర్ధన్, ఆర్ఐలు రాజేందర్, అజీమ్, కాంగ్రెస్ నాయకులు గోపగోని సారయ్యగౌడ్, గాజనవేన సదయ్య, లంక సదయ్య, మనోహర్‌రావు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లు

**పాలకుర్తి, న్యూస్‌టుడే:** బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద రామగుండం, పాలకుర్తి, అంతర్గాం ఆటో యూనియన్ల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ హాజరై మాట్లాడారు. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఆటోలు ఎక్కడమే మానేశారని.. దీంతో గిరాకీ లేక రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 60 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నరన్నారు. అనంతరం పాలకుర్తి, రామగుండం కార్పొరేషన్ ఏరియా మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలకుర్తి మండల అధ్యక్షుడిగా బి.కమలాకర్, ఉపాధ్యక్షుడిగా జహంగీర్, కార్యదర్శిగా నెరువట్ల లింగయ్య, కోశాధికారిగా భాస్కర్, అధికార ప్రతినిధిగా సత్యం, తొమ్మిది కార్యవర్గ సభ్యులు.. రామగుండం కార్పొరేషన్ ఏరియా కమిటీ అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా తరుణ్, ప్రధాన కార్యదర్శి బాబర్, కోశాధికారి శంకర్, ఏడుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

## రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

**ధర్మారం, న్యూస్‌టుడే:** దొంగతుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని రేవెళ్లి అనూష పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. గత నెల 29న కరీంనగర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన అనూష అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఆదివారం నుంచి మెదక్‌లో నిర్వహించే పోటీల్లో ఆమె పాల్గొననుంది. అనూషను, పీఈటీ శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.


అనూష

## పిల్లలకు బాలామృతం అందించాలి

**గోదావరిఖని, న్యూస్‌టుడే:** పిల్లలకు తప్పనిసరిగా బాలామృతం అందించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు వేడుక మందిరంలో పోషన్ మహా-2024 కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి.. బాలామృతంతో పాటు పోషక విలువలున్న ఆహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల కోసం స్థలాలు గుర్తించే పనిలో ఉన్నామన్నారు. అనంతరం ఓ చిన్నారికి ఎమ్మెల్యే బాలామృతం తినిపించారు. జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్, సీడీపీవో అలేఖ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాకంబరిగా అమ్మవారు

మార్కండేయకాలనీ హనుమాన్ ఆలయ ఆవరణలోని మండపంలో అమ్మవారిని శనివారం శాకంబరిగా అలంకరించారు. కూరగాయలు, పండ్లతో అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దుర్గాదేవి దీక్షదారులకు మహాప్రసాద వితరణ చేశారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం


శాకాంబరీ అవతారంతో దుర్గాదేవికి అలంకరణ




అంతర్గాం పీహెచ్‌సీలో బతుకమ్మ ఆడుతున్న సిబ్బంది


సుల్తానాబాద్‌లో బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థినులు


ముత్తారం వేడుకల్లో..

## కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు

**పెద్దపల్లి, సుల్తానాబాద్, ముత్తారం, మార్కండేయకాలనీ, పాలకుర్తి న్యూస్‌టుడే:** పెద్దపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వృత్తివిద్యా కోర్సుల విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, ప్రిన్సిపల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ ఆటపాటలతో సందడి చేశారు. ప్రధానాచార్యులు రాంచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు.


మార్కండేయ కాలనీలో ఓ ప్రైవేట్ కళాశాలలో..


బతుకమ్మ తీసుకొస్తున్న ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన



# ఆరోగ్య స్పృహతో ఆహార మార్పు

## సంప్రదాయ పదార్థాలకు పెరిగిన ప్రాధాన్యం



రాగి జావ

ఆధునిక జీవనంలో అనారోగ్యాలతో సతమతమవుతున్న ఉమ్మడి జిల్లా వాసులు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. సంప్రదాయ ఆహారం మేలని రాగి, జొన్న, జావ, గటుక, చిరుధాన్యాలు, మొలకెత్తిన తృణ ధాన్యాలు వంటి వాటిని ఉదయం, సాయంత్రం ఆహారంగా తీసుకుంటున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వాటికి డిమాండ్ పెరుగగా, విక్రయ కేంద్రాలు కూడా వివిధగా అందుబాటులోకి వస్తున్నాయి. ఉదయం అల్పాహారంగా వీటిని తీసుకుంటున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది..

న్యూస్‌టుడే- కరీంనగర్ విద్యావిభాగం

### చిరుధాన్యాలతో అల్పాహారం



గటుక

నూనెతో తయారు చేసిన అల్పాహారం ఆరోగ్యానికి హాని చేస్తుందని భావిస్తున్నవారు చిరుధాన్యాలతో చేస్తున్న అల్పాహారం వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు టిఫిన్ సెంటర్ల వారు వాటిని రుచికి తగ్గట్టుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. కొర్రల ఉప్మా, రాగులతో ఇడ్లీ, దోశ, ఉప్మా, మిల్లెట్ దోశ తదితరాలు తయారు చేస్తున్నారు. పీచు, కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం వాటిల్లో ఎక్కువగా ఉండటం కొవ్వు శాతం తక్కువ కావడంతో వయోభారం, అధిక బరువుతో బాధపడుతున్న వారు ఈ అల్పాహారం తీసుకునేందుకు సన్నద్ధత పెరిగింది.

### వివిధ రకాల జ్యూస్‌లు..

వివిధ రకాల జ్యూస్‌ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. ముసాంబి, బూడిద గుమ్మడి, సొరకాయ, బీట్‌రూట్, క్యారెట్, గోధుమ గడ్డి, కలబందలతో జ్యూస్‌లు తయారు చేసి విక్రయించే కేంద్రాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. వీటిల్లో అధిపోషక విలువలు ఉండటం, ఉపశాంతులు, వివిధ రకాల రుగ్మతల నివారణకు ఇవి ఉపకరిస్తున్నాయని భావిస్తుండటంతో గిరాకీ పెరిగింది. 35 ఏళ్ల పైబడిన వారి నుంచి వృద్ధుల వరకు నిత్యం వాటిని తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో 10 వరకు వాటి విక్రయ కేంద్రాలు ఉండగా, ఒక్కో కేంద్రంలో 50 నుంచి 80 గ్లాసుల వరకు జ్యూస్‌లు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని వయసుల వారు ఆహారం, ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. సంప్రదాయ రుచులను ఆస్వాదిస్తున్నారు.

☛ ఉదయం వేళ అల్పాహారం స్థానంలో రాగి జావ, జొన్న గట్క, అలోవెరా, క్యారెట్, బీట్‌రూట్ జ్యూస్ తదితరాలు తీసుకునేవారు పెరుగుతున్నారు. ఉదయపు నడక, వ్యాయామాలు పూర్తి చేసి ఈ ఆహారాన్ని ఆస్వాదిస్తున్నారు.

☛ రాత్రి వేళల్లో చాలా మందికి జొన్న రొట్టె ఇష్టమైన ఆహారంగా మారిపోయింది.

☛ అధిక బరువును తగ్గించేందుకు, శక్తికి, ఎముకల బలానికి, మధుమేహ నియంత్రణకు, కొవ్వును తగ్గించేందుకు ఈ ఆహారం దోహదపడుతుందని చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు.

☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన మైదానాలు, రహదారుల పక్కన ప్రత్యేకంగా వీటి విక్రయ కేంద్రాలు వివిధగా వెలిశాయి. సుమారు రెండు వందల కేంద్రాలు ఉన్నట్లు విక్రయదారులు పేర్కొంటున్నారు.

☛ నిత్యం ఒక్కో కేంద్రంలో జావ, గటుక కోసం 150 మంది వరకు వస్తున్నారని నిర్వాహకులు తెలుపుతున్నారు. వ్యాయామం చేసేవారే కాకుండా ఉద్యోగులు, గృహిణులు వీటిని తీసుకోవడం పెరుగుతోంది.

☛ మొలకెత్తిన తృణ ధాన్యాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. దీంతో విక్రయాలు పెరుగుతున్నాయి.




కరీంనగర్‌లోని ఓ రాగి జావ కేంద్రం వద్ద సందడి



కలబంద జ్యూస్

# ఆస్తి కోసం దారుణ హత్య

## తల్లిదండ్రులతో కలిసి అన్నను చంపిన తమ్ముడు



రాజు

**హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే :** ఆస్తి కోసం కన్నేసిన తమ్ముడు అన్నను అడ్డు తొలగించుకుంటేనే తాను భూమి పొందొచ్చని భావించాడు.. తల్లిదండ్రులు కూడా అతనికి సహకరించారు.. దీంతో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాజపల్లిలో శుక్రవారం రాత్రి నోముల రాజు (35)ను అయినవారే దారుణంగా హత్య చేశారని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజపల్లికి చెందిన నోముల చంద్రయ్య, ఎల్లమ్మ దంపతులకు నోముల రాజు (35), అంజి ఇద్దరు కుమారులు. అవివాహితుడైన రాజు స్థానికంగా ఉంటూ వృత్తి రీత్యా డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబానికి చెందిన మూడున్నర ఎకరాల పొలంలో వ్యవసాయ పనులు చూసుకునేవారు. అంజికి వివాహం కాగా, కొంతకాలం హైదరాబాద్‌లో కారు నడుపుకొంటూ జీవించాడు. కొద్ది రోజుల క్రితం హుజూరాబాద్‌కు వచ్చి ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేసిన అతను వ్యవసాయ భూమి తనకు ఇవ్వాలని రాజుతో ఇటీవల తరచూ గొడవకు దిగుతున్నాడు. రాజు ఒప్పుకోకపోయేసరికి కక్ష పెంచుకున్నాడు. రాజును హత్య చేస్తే ఆస్తి మొత్తం తనకే దక్కుతుందని భావించి తల్లిదండ్రులతో కలిసి కుట్ర పన్నాడు. శుక్రవారం రాత్రి రాజు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కర్రతో తలపై మోది చంపాడు. శనివారం తెల్లవారుజామున రాజు నిద్రలేవడం లేదని తల్లిదండ్రులు ఇరుగుపొరుగు వారిని పిలిచారు. మంచంపై అతను చనిపోయినట్లు కనిపించటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై మహ్మద్ యూనుస్ అలీలు సంఘటన స్థలాన్ని పరిశీలించడంతోపాటు కుటుంబసభ్యులు, గ్రామస్థులతో మాట్లాడారు. విచారణలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నట్లు గుర్తించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. రాజును తమ్ముడు అంజి, తల్లిదండ్రులు చంద్రయ్య, ఎల్లమ్మలు కలిసి బలమైన ఆయుధంతో తలపై కొట్టి హత్య చేసి ఉంటారనే అనుమానం ఉందని పంచాయతీ కార్యదర్శి కృపారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అంజి, రాజు తల్లిదండ్రులను విచారించగా కర్రతో కొట్టి చంపినట్లు వెల్లడించారని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు అంజి, చంద్రయ్య, ఎల్లమ్మలను శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్టు

## బావను హతమార్చి వరదకాలువలో పడేసిన బావమరింది

**కోరుట్ల, న్యూస్‌టుడే:** చెల్లె, కోడలుకు ఆపద పొంచి ఉందని భావించి బావను బావమరిదే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయం బయటపడింది. కోరుట్లలో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు శనివారం వివరాలు వెల్లడించారు. కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన నేతుల మల్లేశం 2015లో కన్న కుమారుడిని హత్య చేయగా కోరుట్ల కోర్టు ఏడేళ్లు జైలు శిక్ష విధించింది. గతేడాది జైలు నుంచి విడుదలైన ఆయన భార్య లావణ్య, కూతురును వేధిస్తూ చంపుతానని బెదిరిస్తున్నాడు. చెల్లె, కోడలుకు అతనితో ఆపద ఉందని భావించి బావను హత్యచేయాలని భూషణ్‌రావుపేటకు చెందిన భూపతి గంగారాం నిర్ణయించుకున్నాడు. ఈ నెల 1న మల్లేశంకు ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకొని మద్యం తాగించాడు. అనంతరం మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులో విందు ఉందని చెప్పి అక్కడికి తీసుకెళ్లి మద్యం తాగారు. రాత్రి ఇంటికి తిరిగొచ్చే క్రమంలో దుంపేట వరద కాలువ వద్ద మళ్లీ మద్యం తాగారు. మల్లేశం మద్యం మత్తులో ఉండగా గంగారాం బండరాయితో తలపై మోదడంతో పాటు వంతెన గోడకు బలంగా బాదాడు. మృతదేహాన్ని కాలువలో పడేసి వాహనాన్ని కిందపడేసి పరారయ్యాడు. వరద కాలువ వంతెన వద్ద మల్లేశం ద్విచక్ర వాహనం పడి ఉండడంతో పాటు కనిపించడం లేదని ఆయన సోదరుడు రాజమల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంగారాంపై అనుమానంతో 4న అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయం, కారణాలను వెల్లడించారు. మృతదేహం మేడిపల్లి మండలం విలయతాబాద్ వద్ద లభించిందని, హత్యలో గంగారాంతో పాటు ఇంకెవరైనా పాలుపంచుకున్నారా అని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. సీఐ సురేష్‌బాబు, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

# తుది దశకు డీఎస్సీ-2008 ధ్రువపత్రాల పరిశీలన

**కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే:** ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీల నియామకాలకు జిల్లా విద్యాశాఖ చేపట్టిన ఉమ్మడి జిల్లాలోని డీఎస్సీ 2008 బాధిత అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన తుది దశకు చేరుకుంది. జిల్లా విద్యాశాఖ ఉమ్మడి జిల్లాలోని 186 మంది జాబితాలను ప్రకటించింది. జాబితాలో పేర్లు ఉన్న వారిలో చాలామంది వేర్వేరు కారణాలతో ధ్రువపత్రాల పరిశీలనకు రాలేదు. ఆదివారం కూడా ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని అధికారులు తెలిపారు.



డీఈవో కార్యాలయం ముందు జాబితాలో పేర్లు లేని అభ్యర్థులు

### 96 మంది మాత్రమే హాజరు..

జిల్లా విద్యాశాఖ గత నెల 27 నుంచి శనివారం వరకు నిర్వహింతచిన ధ్రువీకరణపత్రాల పరిశీలనకు మొత్తం 96 మంది అభ్యర్థులు హాజరైనట్లు సంబంధిత అధికారులు చెప్పారు. మిగిలిన 90 మంది అభ్యర్థులు హాజరుకాకపోవడం అధికారులను విస్తుగోలుపుతోంది. పదో తరగతి మార్కుల మెమోలు, స్టడీ సర్టిఫికెట్లు వారి వద్ద లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. పరిశీలనకు హాజరుకాలేని పలువురు డూప్లికేట్ మార్కుల మెమో కోసం రాష్ట్ర విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద మెమోల కోసం నిరీక్షిస్తున్నారని కొందరు తెలిపారు. వీరికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంలో అధికారులు సానుకూలంగా ఉన్నారు.

### తమకూ న్యాయం చేయాలి

ధ్రువీకరణపత్రాల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ ప్రకటించిన జాబితాలో అర్హులైన తమ పేర్లు లేవని, తమకు న్యాయం చేయాలని 8 మంది (పాత మెరిట్ జాబితాలో ఉన్నవారు) ఆందోళన వ్యక్తం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులుగా ఉన్న మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు ఈ విషయంలో చొరవ చూపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

# ఛాంపియన్‌గా కరీంనగర్ క్రికెట్ జట్టు

**కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జట్టు ఛాంపియన్స్‌గా నిలిచింది. శనివారం తుది పోరులో కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు సాధించింది. కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. విగ్నేష్ 53 (నాటౌట్), కమ్రాన్ 50, రిత్విక్ 29 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మ్యాన్ ఆఫ్ ది ఫైనల్స్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా విగ్నేష్ ఎంపికైనట్లు జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు తెలిపారు. క్రీడాకారులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఆగంరావు, ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌గౌడ్, సి.హెచ్ అజిత్‌కుమార్, విద్యాసాగర్‌రావులు నగదు బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించి అభినందించారు.



బహుమతి అందుకుంటున్న జిల్లా క్రీడాకారులు